క్లుప్తంగా

విద్యార్థినికి ఎంపీ సన్మానం



అంజలిని సన్మానిస్తున్న ఎంపీ అర్వింద్

రాయికల్: మండలంలోని రామాజీపేటకు చెందిన కనికరపు అంజలి ఇంటర్ ఫస్ట్ ఇయర్ బైపీసీలో 436 మార్కులతో రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంక్ సాధించగా, బుధవారం నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అంజలిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రామాజీపేట ఎంపీటీసీ ఆకుల మహేశ్, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు కోల శంకర్, రామాజీపేట గ్రామ అధ్యక్షుడు చిలువేరి నాగరాజు, నాయకులు కంటె భూమేశ్, రాజేశ్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేస్తాం



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్

రాయికల్: రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేస్తామని తహసీల్దార్ ఖయ్యూం అన్నారు. బుధవారం రాయికల్ మండలం అల్లీపూర్, ఆలూరు, కట్కాపూర్, దావన్‌పల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. రైతులు ఇబ్బందులు కలగకుండా అన్ని రకాల చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక



బీఆర్‌ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి

ధర్మపురి: పట్టణంలోని 5 వ వార్డుకు చెందిన ముప్పట్ల గుండయ్య, అచ్చమ్మ, చెందోలి జమున, బోనాల రాజన్న, బత్తిని రాజేశ్ బుధవారం రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి మంత్రి కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు.ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు.

జీవన భృతి చెల్లించాలని బీడీ కార్మికుల ధర్నా



మేడిపల్లిలో ధర్నా చేస్తున్న బీడీ కార్మికులు

మేడిపెల్లి: బీడీ కార్మికులందరికీ జీవన భృతి చెల్లించాలని బుధవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీడీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బీడీ కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా 2014 కటాఫ్ డేట్‌తో సంబంధం లేకుండా బీడీ కార్మికులందరికీ రూ. 2016 జీవన భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ బాసిరోద్దిన్‌కు వినతి పత్రం అందజేశారు.కార్యక్రమంలో ఏఐటీయూసీ నేతలు చిట్యాల లక్ష్మణ్, మునుగురి హన్మంతు, గంగనర్సయ్య, రాధ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలి

మల్లాపూర్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించేవరకు శ్రమించాలని సొసైటీ చైర్మన్ నేరేళ్ల మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం మల్లాపూర్ మండలంలోని చిట్టాపూర్‌లో ఇంటర్ ఫలితాల్లో బైపీసీ ఫస్టియర్‌లో స్టేట్ టాపర్ నిలిచిన బద్దం రష్మితను ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు కొత్తపల్లి రాజరెడ్డి, కట్కం నర్సారెడ్డి, రంజిత్, అంజిరెడ్డి, శేఖర్, విష్ణువర్ధన్,రాజు, రాజేందర్, జీవన్, సుమన్, లింగారెడ్డి, లక్పతి, చిన్నారెడ్డి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

గొల్లపల్లి: అకాలవర్షంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకొని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని వైఎస్సార్ టీపీ ధర్మపురి నియోజకవర్గ ఇన్‌చార్జి మోకెనపల్లి రాజమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని చెందోళిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు.రంగు మారినా, తడిసిన ధాన్యం సైతం కొనాలన్నారు. వైఎస్సార్‌టీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

సదుపాయాలకు మంగళం!

- ఉపాధి కూలీలకు ఐదేళ్లుగా అందని పరికరాలు
- పని ప్రదేశంలో కూలీలకు నీడ కరువు
- పట్టించుకోని అధికారులు
- ఎండలో ఇబ్బంది పడుతున్న కూలీలు



గోవిందుపల్లిలో చెట్టు నీడన సేద తీరుతున్న ఉపాధి కూలీలు

గొల్లపల్లి: జాతీయ ఉపాధి హామీ పథకం కూలీలకు పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమవుతోంది. వేసవి ప్రారంభంలో కూలీలకు కల్పించాల్సిన వసతులపై అధికారులు ఏలాంటి స్పష్టత ఇవ్వలేదు. ఇప్పటికే ఎండ పెరగడంతో పనులు చేసేందుకు కూలీలు ఇబ్బందులు పడుతున్నారు.గతంలో పని ప్రదేశాల్లో గూడారాలు ఏర్పాటు చేసేవారు.తాగు నీటి వసతి మెడికల్ కిట్లను అందుబాటులో ఉంచేవారు. పని లేని సమయంలో విశ్రాంతి తీసుకోవడానికి వసతి లేక కూలీలు తంటాలు పడుతున్నారు.ఉపాధి పనులు కొనసాగుతున్న ప్రదేశాల్లో కూలీలకు నీడ కోసం గ్రీన్ షెడ్‌ను ఏర్పాటు చేయాల్సి ఉన్న పట్టించుకునే వారు లేకుండా పోయారు. దీంతో తప్పని పరిస్థితిలో మండుటెండలోనే కూలీలు పని చేయాల్సి వస్తోంది. కనీస వసతులు లేకపోవడంతో పాటు బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో ఉపాధి పనులకు వెళ్లేందుకు కూలీలు అంతగా ఆసక్తి చూపడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మొత్తం జాబ్‌కార్డులు:1.66 లక్షలు
కూలీలు:2.71లక్షలు.

నిలువ నీడ లేక..

ఉపాధి కూలీలకు ఐదేళ్లుగా పార, గడ్డపార, తట్టలు తదితర సామగ్రి అందడం లేదు. కూలీలు సొంతంగా వాటిని సమకూర్చు కోవడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఎండ తీవ్రత క్రమంగా పెరుగుతుండటంతో కూలీలు తాగు నీటిని వెంట తీసుకెళ్తున్నారు. కూలీలు పని చేసే సమయంలో ఎండ తీవ్రతను తట్టుకోలేక సమీపంలో చెట్ల నీడన సేద తీరుతున్నారు. కూలీలకు చిన్న పిల్లలు ఉంటే వారిని ఆడించేందుకు ఆయాలను కూడా నియమించాలని నిబంధనలున్నాయి. ప్రస్తుతం ఆయా వ్యవస్థను ప్రభుత్వం తీసేసింది. దీంతో చిన్న పిల్లలున్న కూలీలు పనులకు రావడానికి ఆసక్తి చూపడం లేదు.

పనిముట్లు సరఫరా చేయాలి



గత పదేళ్లుగా పనులు చేస్తున్నా పనిముట్లు సరఫరా చేయడం లేదు. పారలు, గడ్డ పారలు లేక సొంతంగా చేయించుకుని ఇంటి వద్ద నుంచి ప్రతి రోజు మోసుకుని రావాల్సి వస్తోంది. పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించలేదు.కూలీలకు నీడ, తాగునీటి వసతి కల్పించాలి.

– రేవెల్లి జలేందర్, భీంరాజ్‌పల్లి

కూలి రేట్లు పెంచాలి



ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు గిట్టుబాటు కావడం లేదు. 6 గంటలు పని చేసిన రూ.270 మాత్రమే కూలి పడుతుంది. వేసవి కాలంలో ఈ వేతనాన్ని డబుల్ చేస్తేనే గిట్టుబాటు అవుతుంది. పనిచేసే కూలీలకు ఏడాదికి 200 పని దినాలు కల్పించి రోజుకు రూ.500 చొప్పున కూలి చెల్లించాలి.

– సుద్దాల బాబు,భీంరాజ్‌పల్లి

సరఫరా లేదు



వేసవి దృష్ట్యా కూలీలకు ఎండ దెబ్బ తగలకుండా ఉదయం 6 నుంచి 11 గంటల వరకు పని చేయాలి.గడ్డపార, గంప, వాటర్‌కు సంబంధించి ప్రతి రోజు రూ.5 చొప్పున అదనంగా కూలీలకు అందుతుంది. అత్యవసరమైన చోట వైద్యసిబ్బంది కూలీలు అందుబాటులో ఉంటున్నారు.

– నవీన్ కుమార్,ఎంపీడీవో , గొల్లపల్లి

జగిత్యాల అభివృద్ధే ధ్యేయం

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: జగిత్యాల అభివృద్ధే ధ్యేయమని, గతంలో కంటే ఎంతో అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో పనులను పరిశీలించి కొన్ని పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టణంలో గతంలో కంటే అత్యధిక నిధులు వెచ్చించి ఎంతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. జగిత్యాల మున్సిపాలిటీని సుందరంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. చింతకుంట చెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా మార్చడం, ఓపెన్ జిమ్‌లు, ఆహ్లాదకరమైన పార్క్, ఉద్యానవనాలను తలపిస్తున్న శ్మశాన వాటికలు, పేద ప్రజల కోసం జగిత్యాలలో ఆస్పత్రిలో అన్ని విభాగాల ఏర్పాటు, ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి, బీడీ పింఛన్లు దేశంలో ఎక్కడ లేని విధంగా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్, కౌన్సిలర్లు పంబాల రాము, బొడ్ల జగదీశ్, చాంద్‌పాషా, జంగిలి రాజేశ్, ఆనందరావు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ నంబర్ వన్

- ఎమ్మెల్యే రమేశ్ బాబు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

మేడిపెల్లి: అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో రాష్ట్రం దేశంలోనే నంబర్ వన్‌గా ఉందని వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ బాబు అన్నారు. మంగళవారం మేడిపెల్లి, భీమారం మండలాల్లో ఆయన పర్యటించారు. ఈ మేరకు మండలంలోని పోరుమల్ల, జోగిన్‌పల్లి రోడ్డు, తొంబర్రావు పేట్, మోరపెల్లి రోడ్డు, రెండు బ్రిడ్జీ ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మేడిపెల్లి లో రూ.22 లక్షలతో నిర్మించిన రైతు వేదిక ను ప్రారంభించారు. మన ఊరు , మన బడి కార్యక్రమంలో భాగంగా 1.22 కోట్లతో నిర్మించే జెడ్పీ హైస్కూల్ భవనానికి భూమిపూజ చేశారు. అలాగే కొండాపూర్‌లో పల్లె దవాఖానకు భూమిపూజ చేసి, భీమారం మండలంలోని వెంకట్రావ్ పేట్ నుంచి ఒడ్డాడ్ రోడ్డులో రెండు బ్రిడ్జీలకు, కాచారంలో గ్రామపంచాయితీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు, మహిళలకు పెద్దపీట వేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణేనన్నారు. ఆగష్టు చివరి నాటికి నియోజక వర్గంలో ఇచ్చిన హామీలు నెరవేర్చుతామని తెలిపారు. ఈ సందర్భంగా 22 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ హొద్దినేని హరిచరణ్ రావు, ఎంపీపీ దోనకంటి ఉమాదేవి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ, మార్కెట్ కమిటీ సభ్యులు, రైతు బంధు సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు కారోబార్ల వినతి

గ్రామ పంచాయతీ సిబ్బంది, కారోబార్ల సమస్యలు వెంటనే పరిష్కారించాలని బుధవారం మేడిపెల్లిలో పర్యటించిన ఎమ్మెల్యే రమేశ్ బాబు ను పంచాయతీ సిబ్బంది కోరారు. ఈ సందర్భంగా తమ సమస్యలు, డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. కార్యక్రమంలో కారోబార్ సురేశ్, సత్యం, గంగారాం ఉన్నారు.

సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాలల విదార్థులు



గొల్లపల్లి: మోడల్ స్కూల్ విద్యార్థుల విజయకేతనం



ఇబ్రహీంపట్నం: టాపర్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్

జగిత్యాలరూరల్: మండలంలోని 16 ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులు 85.82 శాతం మంది విద్యార్థులు పాసయ్యారు. మొత్తం 494 మంది పరీక్షలు రాయగా 424 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. లక్ష్మీపూర్‌లోని జ్యోతిబాపూలే పాఠశాలకు చెందిన పి.నిహారిక, పి.మధులిక, కె.శ్రీలత 10 జీపీఏ సాధించారు.

మేడిపెల్లి: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండలానికి చెందిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. మండల వ్యాప్తంగా 89.10 శాతం విద్యార్థులు పరీక్షల్లో ఉత్తీర్ణులు అయ్యారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ కు చెందిన విద్యార్థిని ఏలేటి అమూల్య 10 జీపీఏ సాధించింది. మండలంలోని దమ్మన్నపేట్, మన్నెగూడెం, ఈదుల లింగంపేట్ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి.

ఎస్సెస్సీ ఫలితాల్లో మండల ఉత్తీర్ణత 57.41 శాతం

మల్లాపూర్:పదో తరగతి ఫలితాల్లో మల్లాపూర్ మండలం 57.41 శాతంతో 465మంది విద్యార్థులకు గాను 267మంది ఉత్తీర్ణులయ్యారని ఎంఈవో భీమయ్య తెలిపారు.

కథలాపూర్: ఎస్సెస్సీ ఫలితాల్లో కథలాపూర్ మండలంలో 86.54 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు ఎంఈవో ఆనందరావు బుధవారం తెలిపారు. పరీక్షలకు 468 మంది విద్యార్థులు హాజరు కాగా 405 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

సారంగాపూర్: సారంగాపూర్ మండలంలో పదవ తరగతిలో 50.57 శాతం ఉత్తీర్ణత సాధించగా, బీర్‌పూర్ మండలంలో 73.30 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. సారంగాపూర్ మండలంలోని అర్పపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 100 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.

గొల్లపల్లి: 10వ తరగతి ఫలితాల్లో 11 జిల్లా పరిషత్ పాఠశాలలు, కస్తూర్బా, టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్, మోడల్ మోడల్‌స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. 386 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 328 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. 84.97 శాతం ఉత్తీర్ణ సాధించినట్లు మండల విద్యాధికారి జమునాదేవి తెలిపారు.

బుగ్గారం మండలంలో తగ్గిన ఉత్తీర్ణత

బుగ్గారం: పదోతరగతి ఫలితాల్లో ఈసారి బుగ్గారం మండలంలో ఉత్తీర్ణత శాతం గణనీయంగా తగ్గింది.మండలంలోని ఆరు ఉన్నత పాఠశాలల నుంచి 95 మంది పరీక్షలకు హాజరు కాగా, మొత్తం కేవలం 45 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు

పెగడపల్లి మండలంలో..

పెగడపల్లి: మండలంలో పదోతరగతి పలితాల్లో ఉత్తీర్ణత శాతం తగ్గింది. ఈ ఏడాది 74.28 శాతం మాత్రమే ఉత్తీర్ణులయ్యారు.

మల్యాలలో 84.97శాతం ఉత్తీర్ణత

మల్యాల:మల్యాల మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలతోపాటు ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 497మంది విద్యార్థులు పదో తరగతి పరీక్ష రాయగా, 421మంది ఉత్తీర్ణత సాధించారు. తాటిపల్లి బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తంగా 84.97 శాతం ఉత్తీర్ణత సాధించారు.

కోరుట్ల రూరల్: కోరుట్ల పట్టణంలో 6 మండలంలోని 12 ప్రభుత్వ పాఠశాలల్లో మొత్తం 677 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయగా 516 మంది ఉత్తీర్ణులయ్యారు. మండలంలో 82.2 శాతం, పట్టణంలో 70.6 శాతం ఉత్తీర్ణత పొందినట్లు ఎంఈవో గంగుల నరేశం తెలిపారు.

మోడల్ స్కూల్ విద్యార్థులు..

కోరుట్ల రూరల్: పదవతరగతి పరీక్షా ఫలితాల్లో కల్లూర్ మోడల్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. డుదవారం ప్రకటించిన ఫలితాల్లో పాఠశాలలో 30 మంది విద్యార్థులు 9జీపీఏ పైన మార్కులు సాధించి పాఠశాలను మండలంలో మొదటి స్థానంలో నిలిపారు.ప్రతిభ చూపిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

మండల టాపర్‌గా మోడల్ స్కూల్ విద్యార్థిని

ఇబ్రహీంపట్నం: 10వ తరగతి పరీక్ష ఫలితాలు బుధవారం వెల్లడి కావడంతో ఇబ్రహీంపట్నం మోడల్ స్కూల్‌కు చెందిన టి. శ్రీ వైష్ణవి 9.7 జీపిఎ సాధించి మండల టాపర్‌గా నిలిచింది. మండల టాపర్‌గా నిలిచిన శ్రీ వైష్ణవిని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్ ఘనంగా సన్మానించి అభినందించారు.

సంక్షిప్త వార్తలు

ఆర్టీఏ చట్టాన్ని అపహాస్యం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

మల్లాపూర్: ఆర్టీఏ ద్వారా సమాచారం కోరితే విచారణకు రమ్మంటున్నారని ఆర్టీఏ కార్యకర్త ముత్యం రఘు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో మాట్లాడారు. మల్లాపూర్ ఎంపీడీవోకు ప్రభుత్వం కల్పిస్తున్న వాహనానికి సంబంధించి అలవెన్స్ వివరాలు గత నెల 29న ఆర్టీఏ ద్వారా రిజిస్టర్ పోస్టుతో సమాచారాన్ని కోరానన్నారు. కాగా ఈ నెల 5న రాత్రి వెంకటరమణ అనే వ్యక్తి ఫోన్ చేసి మండల కార్యాలయానికి విచారణ నిమిత్తం రావాలని ఎంపీడీవో సార్ ఉదయం 11గంటలకు ఆఫీస్‌కు రమ్మంటున్నాడని అన్నట్లు తెలిపారు. ఆర్టీఏను రిజిస్టర్ పోస్టు ద్వారా పంపించానని, సమాచారం కూడా రిజిస్టర్ పోస్టు ద్వారానే పంపాలని సమాధానం ఇచ్చానన్నారు. కాగ ఆర్టీఏ చట్టాన్ని నీరుగార్చే విధంగా వ్యవహరించిన ఎంపీడీవో, ఆఫీస్ సబార్డినేట్ వెంకటరమణపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు రఘు తెలిపారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే కొనుగోళ్లలో జాప్యం

కథలాపూర్ : ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే ధాన్యం కొనుగోళ్లలో జాప్యం జరుగుతోందని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పోతారం గ్రామంలో అకాలవర్షంతో పంటలు నష్టపోయిన రైతులను పరామర్శించారు. వర్షాలతో కొనుగోలు కేంద్రంలోని 500 క్వింటాళ్ల ధాన్యం కొట్టుకుపోయి మొలకెత్తాయన్నారు. ఎమ్మెల్యే రమేశ్‌బాబు చొరవ తీసుకొని నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 50 వేల నష్టపరిహారం ప్రభుత్వం నుంచి ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఇక్కడ బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి గంద్ర విజయ్‌రావు, నాయకులు బండ అంజయ్య, లోక్యనాయక్, రాజమల్లయ్య, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం కప్ క్రీడా పోటీల్లో పాల్గొనాలి

సారంగాపూర్: మండల స్థాయిలో ఈ నెల 15 నుంచి 17 వరకు నిర్వహించనున్న సీఎం కప్ క్రీడా పోటీల్లో పాల్గొనాలని ఎంపీపీలు కోల జమున, మసర్తి రమేశ్ అన్నారు. సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల అధికారులు బుధవారం ఏర్పాట్లపై ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ మహిళలకు, పురుషులకు వేరు వేరుగా నిర్వహిస్తున్నామని, ఆసక్తిగల వారు పాల్గొన్నాలని పేర్కొన్నారు. సమావేశాల్లో ఎంపీడీవోలు రాజేందర్, మల్లారెడ్డి, ఎంఈవో వాసం భీమయ్య, ఎంపీవోలు శశికుమార్ రెడ్డి, ఏపీకే రాజు, అధికారులు పాల్గొన్నారు.

సీఎం కప్ నిర్వహణపై సమీక్ష

కోరుట్ల రూరల్: ఈ నెల 15వ తేదీ నుంచి 17వ తేదీ వరకు రెండు రోజులు నిర్వహించే సీఎం కప్ 23 నిర్వహణంపై స్థానిక ఎంపీపీ కార్యలయంలో బుదవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆటల పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 13వ తేది సాయంత్రం వరకు తమ వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు జి. రాజేష్, సెల్ 9885254714, టి.చక్రాధర్ రావు సెల్ 9441622961 నంబర్లలో సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నీరజ, ఎంఈవో నరేశం, మున్సిపల్ అధికారులు, పీఈటీలుపాల్గొన్నారు.

నియామకం

ఆర్‌యూపీపీటీ ఉపాధ్యక్షుడిగా నరేందర్

ధర్మపురి: రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ తెలంగాణ శాఖ ఉపాధ్యక్షుడిగా ధర్మపురికి చెందిన కట్కం నరేందర్ ఎన్నికై నట్లు రాష్ట్ర అధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్లా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నరేందర్ ఎన్నికపై రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుమల కాంత కృష్ణ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

పది ఫలితాల్లో ప్రైవేట్ పాఠశాలల ప్రభంజనం




10 జీపీఏ సాధించిన విద్యార్థులతో యాజమాన్యం

జగిత్యాల: పదో తరగతి ఫలితాల్లో జగిత్యాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబర్చారు. జ్యోతి, మానస, సూర్య స్కూల్స్‌కు చెందిన 24 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించి జిల్లాలో నంబర్‌వన్‌గా నిలిచారు. అలాగే 9.8 జీపీఏ 19 మంది సాధించగా, 9.0 జీపీఏ అందరు విద్యార్థులు సాధించి జిల్లాకే గర్వకారణంగా నిలిచారు. అల్ఫోర్స్ విద్యార్థులు సోనియా 10/10, విష్ణుమిత్ర 10/10, కనిష్క రెడ్డి 10/10, అద్వైత్ 10/10 జీపీఏ సాధించారు. శ్రీ చైతన్య స్కూల్ 109 మంది విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా జ్యోతి, మానస, సూర్య పాఠశాలల డైరెక్టర్లు హరిచరణ్‌రావు, రజితరావు, మౌనికరావు, అజిత్, సుమన్ రావు, శ్రీధర్‌రావు, అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి, శ్రీచైతన్య పాఠశాల కరస్పాండెంట్ గోవర్ధన్‌రెడ్డి విద్యార్థులను అభినందించారు.

క్రైం కార్నర్..

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య



సరిత (ఫైల్)

రాయికల్: మండలంలోని కుమ్మరిపల్లి గ్రామానికి చెందిన బొద్దూరి సరిత (26) అనే వివాహిత ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. కుమ్మరిపల్లికి చెందిన బొద్దూరి సరిత భర్త రాజ్‌కుమార్ ఉపాధి నిమిత్తం దుబాయ్‌కి వెళ్లగా అక్కడ పని సరిగా లేకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పేర్కొన్నారు. మృతురాలి తల్లి నర్సవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి భర్త, ఇద్దరు బాబులు ఉన్నారు.

ఒకరిపై దాడి, కేసు నమోదు

సారంగాపూర్: మండలంలోని ఒడ్డెరకాలనీలో ఒకరిపై దాడి చేసిన వ్యక్తులపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై మనోహర్‌రావు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం ఒడ్డెరకాలనీకి చెందిన బోదాసు నాంపల్లిపై రాయికల్ మండలం రాజనగరం గ్రామానికి చెందిన సంతోష్, నరేశ్‌లతో పాటు మరికొంత మంది మంగళవారం రాత్రి నాంపల్లి ఇంటికి వచ్చి దాడి చేశారు. పాతకక్షలు మనసులో పెట్టుకుని దాడి చేయడంతో నాంపల్లి తలకు బలమైన గాయమైంది. బాధితుడి తండ్రి చిన్నయ్య ఫిర్యాదు మెరకు సంతోష్, నరేశ్‌తో పాటు మరికొంత మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెవిలో పూలతో పంచాయతీ సిబ్బంది నిరసన



నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ముందు ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సమ్మె చేపట్టిన పంచాయతీ కారోబార్లు, బిల్ కలెక్టర్లు, సిబ్బంది బుధవారం చెవుల్లో పువ్వులు పెట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అంజన్న జయంతికి ముమ్మరంగా ఏర్పాట్లు



ఆలయ పరిసరాల్లో చలువ పందిళ్లు

మల్యాల: కొండగట్టు ఆంజనేయస్వామి జయంతి ఉత్సవాలకు వచ్చే దీక్షాపరులు, భక్తుల కోసం ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ పరిసరాల్లో చలువ పందిళ్లు వేశారు. జయంతి ఉత్సవానికి వచ్చే భక్తుల కోసం సుమారు 3 లక్షల లడ్డూలు సిద్ధం చేసినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆలయ పరిసరాల్లో పదిచోట్ల తాగునీరు ఏర్పాటు చేశారు. ఎల్ఈడీ స్క్రీన్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. జయంతి ఉత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లు, ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు ఇప్పటికే జిల్లాలోని వివిధ విభాగాల అధికారులను జిల్లా కలెక్టర్ యాస్మిన్ భాష నియమించారు.

మాజీ మంత్రి రత్నాకర్‌రావుకు నివాళి

మెట్‌పల్లి: మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్‌రావు వర్ధంతి వేడుకలను గురువారం కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కొమిరెడ్డి లింగారెడ్డితో పాటు పలువురు నాయకులు ఉన్నారు. జగ్గాసాగర్‌లో వేడుకలు జరిపారు. నాయకులు ఇల్లెందుల రాజు, తిరుపతిరెడ్డి, ప్రశాంత్, రవి, శేఖర్ పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం

జగిత్యాల: బజరంగ్‌దళ్ నిషేధింపు వ్యాఖ్యలకు నిరసనగా విశ్వహిందు పరిషత్ దేశవ్యాప్తంగా అన్ని దేవాలయాల్లో సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేయాలనే పిలుపు మేరకు జగిత్యాలలో వీహెచ్‌పీ నాయకులు స్థానిక అభయాంజనేయస్వామి ఆలయంలో పారాయణం చేపట్టారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు రాములు, రాంచంద్రం, గంగారాం, నరేశ్, భాస్కర్ పాల్గొన్నారు.